రాష్ట్రమంతటా హైడ్రా?

మొదటిపేజీ తరువాయి...

తరహా వ్యవస్థలను విస్తరించేందుకు సిద్ధమైనట్టు సమాచారం. ముందుగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏర్పాటు చేస్తారని, ఆ తర్వాత వాటిని క్రమంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలకు (యూడీఏ) విస్తరిస్తారని సమాచారం. గతంలో యూడీఏల పరిధి కార్పొరేషన్ల చుట్టూ కొన్ని కిలోమీటర్లు మాత్రమే ఉండగా.. ఇటీవల వాటి పరిధిని కూడా విస్తరించడం గమనార్హం.

రాష్ట్రమంతా ఏకపక్ష కూల్చివేతలేనా?

ప్రభుత్వం జూలై 19న హైడ్రా ఏర్పాటు చేస్తూ, దానిని పరిధిని నిర్ణయిస్తూ జీవో 99 జారీ చేసింది. కానీ అనధికారికంగా జూన్‌లోనే కూల్చివేతలు మొదలుపెట్టింది. జూన్ 27న లోటస్‌పాండ్‌లోని పార్కు స్థలం ప్రహరీని కూల్చివేశారు. మొదట్లో అందరూ జీహెచ్‌ఎంసీ కూల్చివేతలుగానే దాన్ని భావించారు. కానీ ప్రభుత్వం అనధికారికంగా హైడ్రా కూల్చివేతలను ప్రారంభించిందని గుసగుసలు మొదలయ్యాయి. ఆ తర్వాత జూలైలో హైడ్రా కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. 'హైడ్రా' ఏర్పాటును గొప్ప సంస్కరణగా ప్రజలకు చెప్పుకునేందుకు మొదట్లో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ వంటి ఖరీదైన ప్రాంతాల్లో మాత్రమే కూల్చివేతలు చేపట్టారనే విమర్శలు ఉన్నాయి. ఆగస్టు 24న హీరో నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌ను కూల్చివేయడంతో హైడ్రాకు విపరీతమైన ప్రచారం జరిగింది. దీంతో బడా అక్రమార్కులపై సర్కారు హైడ్రాతో ఉక్కుపాదం మోపుతుందని అందరూ భావించారు. కానీ అది భ్రమేనని తేలిపోయింది. హైడ్రా తన అసలు రూపం చూపెట్టింది. పేద, మధ్యతరగతి ప్రజలపై పిడుగుపాటుగా మారింది. రామ్‌నగర్, అమీన్‌పూర్ చెరువు, సున్నం చెరువు, కత్వా చెరువు.. ఇలా నిరుపేదల ఇండ్లు, గుడిసెలను కూల్చివేసింది. ఇవన్నీ ఏకపక్షంగా కూల్చివేసినవేనన్నది బాధితుల ఆరోపణ. సూర్యోదయానికే బుల్డోజర్లు వచ్చి పేదల ఇండ్లను నేలమట్టం చేశాయని, ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేతలు జరిపారని విమర్శలు వెల్లువెత్తాయి. ప్రజలు నివాసం ఉన్న నిర్మాణాల జోలికి వెళ్లబోమని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓ సందర్భంలో చెప్పారు. కానీ.. మాదాపూర్ పరిధిలోని సున్నం చెరువు, మల్లంపేట పరిధిలోని కత్వా చెరువులో ప్రజలను బలవంతంగా బయటికి పంపి ఇండ్లను కూల్చివేశారు. కనీసం ఇండ్లల్లో ఉన్న సామాన్లను కూడా తీసుకునే అవకాశం వారికి ఇవ్వలేదు. ఇదే సమయంలో బడాబాబులు, రాజకీయ నేతల ఇండ్లపైకి, ఆక్రమణల వైపు మాత్రం హైడ్రా కన్నెత్తి చూడలేదనే విమర్శలున్నాయి. కేవీపీ వంటి రాజకీయ ప్రముఖులు, పొంగులేటి, ఇతర మంత్రులు, కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేల చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఫాంహౌజ్‌లపై ఆరోపణలు వచ్చినా హైడ్రా పట్టించుకోలేదు. సీఎం రేవంత్ సోదరుడి నివాసానికి తూతూమంత్రంగా నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకోవడమూ దుమారం రేపింది. పేద, దిగువ మధ్యతరగతి ఉండే బస్తీలపై తెల్లారకముందే బుల్డోజర్లు పడి విధ్వంసం సృష్టిస్తే.. పెద్దల ఇండ్లకు మాత్రం 'మీ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నది., మీరే కూల్చుకోండి' అంటూ కోరినంత గడువు ఇచ్చిందని అంటున్నారు. ఈ ఏకపక్ష కూల్చివేతలపై రాష్ట్ర హైకోర్టు సైతం తీవ్రంగా మండిపడింది. కోర్టు చెప్పినా కూల్చివేతలు ఆపకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఈ ఏకపక్ష కూల్చివేతలేంది?. ప్రజలను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తున్నారా? రేపు హైకోర్టు, చార్మినార్‌ను కూడా కూల్చేందుకు సిబ్బందిని పంపుతారా?' అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

పొలిటికల్ బాస్‌ల మాట వింటే జైలుకు వెళ్లేది మీరేనంటూ హైడ్రా కమిషనర్‌కు హెచ్చరించింది. అయినా హైడ్రా వెనక్కి తగ్గలేదు. ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హైడ్రా విస్తరణతో జిల్లాల్లోనూ ఏకపక్ష కూల్చివేతలు మొదలుకానున్నాయనే ఆందోళనలు పేద, మధ్యతరగతి ప్రజానీకంలో వ్యక్తమవుతున్నాయి.

ఇప్పటికే పలు జిల్లాల్లో కూల్చివేతలు

కాంగ్రెస్ పాలనలో నిర్మాణాల కూల్చివేతలు హైదరాబాద్‌కే పరిమితం కాలేదు. ఇప్పటికే అనేక జిల్లాల్లో కూల్చివేతలు జరుగుతున్నాయి. మహబూబ్‌నగర్‌లోని ఆదర్శనగర్‌లో అక్రమ నిర్మాణాలంటూ ఆగస్టు 28న అర్ధరాత్రి 75 ఇండ్లను అధికారులు నేలమట్టం చేశారు. ఇవన్నీ దివ్యాంగులకు చెందినవే. కనీస సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే బుల్డోజర్లు, సాయుధ పోలీసు బలగాలతో రంగంలోకి దిగిన మున్సిపల్, రెవెన్యూ అధికారులు అడ్డొచ్చిన వారిని చెదరగొడుతూ కూల్చేశారని బాధితులు వాపోయారు. 2007లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే పట్టాలు ఇచ్చిందని, ఇప్పుడు వాటిని అక్రమం అంటే ఎలాగని మొత్తుకున్నా ప్రభుత్వం చెవికెక్కించుకోలేదు. పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ పరిధిలో మూడు ఫంక్షన్‌హాళ్లకు నోటీసులు ఇచ్చారు. ఇందులో బీఆర్ఎస్ నేత, మున్సిపల్ కార్పొరేటర్ పెంట రాజేశ్‌కు చెందిన సిరి ఫంక్షన్‌హాల్‌ను ఈ నెల 5న అధికారులు కూల్చివేశారు. మల్లపు రాణి కుంట శివారులో అన్ని అనుమతులతో నిర్మించిన 16 ఇండ్లకు నోటీసులు ఇచ్చారు. జిల్లాలోని అనేక చెరువుల్లో సర్వే చేస్తున్నారు. బఫర్‌జోన్ల హద్దులు నిర్ణయిస్తున్నారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఖానాపూర్ చెరువు పరిసర ప్రాంతాల్లోని ఇండ్లను రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్ అధికారులు రెండు నెలల క్రితం పరిశీలించారు. సిబ్బందితో వచ్చి పలు ఇండ్లు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయంటూ కొలతలు తీస్తూ నంబర్లు వేశారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు అధికారులను అడ్డుకున్నారు. దశాబ్దాలుగా ఇండ్లు నిర్మించుకుని నివాసం ఉంటున్నామని, అన్ని రకాల అనుమతులు ఉన్నాయని మండిపడ్డారు. బస్తీలను కూల్చితే చూస్తూ ఊరుకోమంటూ ఎదురుతిరిగారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆనుకుని ఉన్న రెండు ఇండ్లను అధికారులు కూల్చివేశారు. దీంతో బాధితులు పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు సర్వేను అధికారులు సెప్టెంబర్‌లో ప్రారంభించారు. దీంతో అక్కడి కాలనీవాసులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనలు చేపట్టారు. 50 ఏండ్లుగా అక్కడే బతుకుతున్నామని.. ఇప్పుడు కూల్చేస్తామంటే ఎలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం మాజీ నేతకు చెందిన ఐదు అంతస్తుల భవనాన్ని కూల్చివేశారు. ఇంట్లో ఉన్న వారిని బలవంతంగా బయటికి పంపి, సామాగ్రిని బయట వేసి కూల్చారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో ఈ నెల 4న బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేశారు. ఇలాంటి కూల్చివేతలు ఇకపై రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ జరుగనున్నాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. విపక్ష నేతలకు మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలకు చెందిన ఇండ్లే లక్ష్యంగా కొన్నిచోట్ల ఈ కూల్చివేతలు జరిగినట్టు స్పష్టమవుతున్నది. కానీ ఇకపై చెరువు బఫర్‌లోని పేదలు, మధ్యతరగతి కాలనీలే లక్ష్యంగా ఈ కూల్చివేతలు కొనసాగుతాయోమోనన్న ఆందోళన కూడా ప్రజల్లో వ్యక్తమవుతున్నది.

రాష్ట్రమంతటా 'రియల్' పతనమే

రాష్ట్ర రియల్ ఎస్టేట్‌కు గుండెకాయ లాంటి హైదరాబాద్‌పై ఇప్పటికే హైడ్రా పిడుగు పడింది. ఫలితంగా ప్రతినెల స్థిరాస్తి లావాదేవీలు పడిపోతున్నాయి. మూడు నెలలుగా రియల్‌ఎస్టేట్ రంగం తిరోగమనంలో పయనిస్తున్నది. నిరుడితో పోల్చితే ఈ ఏడాది ఆగస్టు నుంచి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు రాబడి తగ్గుతూ వస్తున్నది. అక్టోబర్‌లోనూ ఇదే పతనం కనిపించింది. ఈ ఏడాది జూలైతో పోల్చితే ఆగస్టు నాటికి స్థిరాస్తి రిజిస్ట్రేషన్లు 27.39 శాతం తగ్గగా, ఆదాయం ఏకంగా 30 శాతం పడిపోయింది. ఇక ఆగస్టుతో పోల్చితే సెప్టెంబర్‌కు పరిస్థితి మరింత దిగజారింది. రిజిస్ట్రేషన్లు 13 శాతం తగ్గగా.. ఖజానాకు రాబడి 28 శాతం తగ్గింది. సెప్టెంబర్‌తో పోల్చితే అక్టోబర్‌లో కేవలం రూ.20 కోట్లు అదనంగా వచ్చింది. కానీ నిరుడు అదే నెలతో పోల్చితే మాత్రం రూ.424 కోట్ల లోటు నమోదైంది. ఇలా జూలైలో హైడ్రా హడావుడి మొదలైనప్పటి నుంచి ప్రతినెల లావాదేవీల సంఖ్యలో సగటున 20 శాతం.. ఆదాయంలో 30 శాతం మేర తగ్గుదల కనిపిస్తున్నది. జిల్లాల్లోనూ ఇప్పటికే క్రయవిక్రయాలు పడిపోయాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు లబోదిబోమంటున్నారు. చెరువులు, కాలువలకు సమీపంలో ఉన్న ప్లాట్లు, ఫ్లాట్లు, ఇండ్లు, భూములు కొనడానికి సాధారణ జనం జంకుతున్నారని చెప్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో లేరని చెప్తున్నా ఎవరూ వినిపించుకోవడం లేదని, ప్రభుత్వం ఏదో వంకతో తమ ఇండ్లు కూల్చుతుందేమోనని సగటు జీవి ఆందోళనకు గురవుతున్నాడని వారు వాపోతున్నారు. పైగా హైడ్రా ఒంటి కన్ను రాక్షసిలా వ్యవహరిస్తున్నదని.. బడా నేతల, ప్రముఖుల ఇండ్లను వదిలి, పేదల ఇండ్లపై దండెత్తుతున్నదని విపక్షం విమర్శిస్తున్నది. బెదిరింపుల దందా కోసమే ప్రభుత్వం హైడ్రాను వినియోగిస్తున్నదని బీఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ దశలో ఇప్పుడు హైడ్రా వంటి వ్యవస్థలను జిల్లాల్లోనూ ఏర్పాటు చేసే దిశగా సర్కారు యోచిస్తుండటం వివిధ వర్గాల్లో ఆందోళన కలిగిస్తున్నది. ఇటు ప్రజానీకంతోపాటు అటు వ్యాపారవర్గాల్లోనూ ఈ 'కూల్చివేతల' అలజడి ఇప్పట్లో తగ్గేలా కనిపించడం లేదు.

రిజిస్ట్రేషన్ల రాబడి	2023 ఆదాయం (రూ.కోట్లలో)	2024 ఆదాయం (రూ.కోట్లలో)	2024 తగ్గుదల
ఆగస్టు	1127	1071	56
సెప్టెంబర్	1120	770	350
అక్టోబర్	1219	795	424

స్థానిక సంస్థలు నిర్వీర్యం

ఇప్పటికే హైదరాబాద్ పరిధిలో అనుమతుల ప్రక్రియను హైడ్రా పర్యవేక్షిస్తున్నది. చెరువులు, నాలాలపైనా ఆధిపత్యం ప్రదర్శిస్తున్నది. భవిష్యత్తులో హైడ్రా నుంచి ఎన్‌వోసీ తీసుకుంటేనే నిర్మాణాలకు అనుమతి ఇస్తారనే ప్రచారం జరుగుతున్నది. ఇది జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ అధికారాలను గుంజుకోవడమేనని, టౌన్ ప్లానింగ్ విభాగాన్ని నిర్వీర్యం చేయడమేనని నిపుణులు చెప్తున్నారు. ఇప్పుడు హైడ్రాను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం ద్వారా పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల అధికారాలన్నీ గుంజుకొని, వాటిని నిర్వీర్యం చేసేలా ఎత్తుగడ వేస్తున్నారంటూ విశ్లేషిస్తున్నారు.

సీఎం నుంచి నేతల దాక..

హైడ్రా తరహా వ్యవస్థలను జిల్లాలకూ విస్తరిస్తాం. చెరువులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

- సెప్టెంబర్ 3న మహబూబాబాద్ పర్యటనలో సీఎం రేవంత్ ప్రకటన
- ప్రజలు హైడ్రాను స్వాగతిస్తున్నారు. జిల్లాల్లోనూ హైడ్రా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు
- సెప్టెంబర్ 22న ఓ టీవీ చానల్‌తో మంత్రి సీతక్క

ప్రతి జిల్లాలోనూ హైడ్రాను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది.

- ఆగస్టు 29న కరీంనగర్‌లో మంత్రి పొన్నం ప్రభాకర్
- నల్గొండ జిల్లాలోనూ హైడ్రాను ఏర్పాటు చేయండి
- ఆగస్టు 27న సీఎంకు లేఖ రాసిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

హైదరాబాద్‌లో హైడ్రా మాదిరిగానే పాలకుర్తిలో హైడ్రా ఏర్పాటు చేస్తాం

- ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి
- హైడ్రాను యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ ఏర్పాటు చేయండి
- మంత్రి ఉత్తమ్‌ను కోరిన భువనగిరి మాజీ మున్సిపల్ చైర్మన్ జహంగీర్

ఆక్రమణలను ఉపేక్షించం

- హైడ్రా కమిషనర్ రంగనాథ్
- తెల్లాపూర్‌లో పలు చెరువుల పరిశీలన

రామచంద్రాపురం, నవంబర్ 27: ఆక్రమణలను ఉపేక్షించేది లేదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టంచేశారు. బుధవారం ఆయన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు, వసం చెరువు, చెలికుంట చెరువులను పరిశీలించారు. చెరువుల పరిసరాలు, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల వివరాలపై ఆరా తీశారు. మేళ్ల చెరువులో మట్టిని నింపి ఆక్రమణకు పాల్పడిన రాజు యాదవ్‌ను హైడ్రా కమిషనర్ ప్రశ్నించగా ఇది తమ పట్టా పొలమని, తమకు గతంలోనే అధికారులు ఎన్‌వోసీలు ఇచ్చినట్టు చెప్పాడు. గతంలో ఇచ్చిన ఎన్‌వోసీలను రద్దు చేసినట్టు కమిషనర్ తెలిపారు. చెరువు ఎఫ్‌టీఎల్‌లో నింపిన మట్టిని తొలిగించాలని ఆదేశించారు. తెల్లాపూర్ సాగునీటి సంఘం మాజీ చైర్మన్ వడ్డె నర్సింహులు హైడ్రా కమిషనర్‌ను కలిసి చెరువుల స్థితిగతులను వివరించారు. ఆయా చెరువుల ఆక్రమణలపై గతంలోనే హైడ్రా కార్యాలయంలో ఫిర్యాదు చేశామని, అందుకు సంబంధించిన పత్రాలను కూడా అందజేసినట్టు పేర్కొన్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువుల జాబితాలో తెల్లాపూర్‌కు సంబంధించిన చెరువుల వివరాలు లేవని ఆయన హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా.. ఈ విషయాన్ని పరిశీలిస్తామని రంగనాథ్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎఫ్‌టీఎల్ హద్దులను నిర్ణయిస్తున్నట్టు ఇరిగేషన్ డీఈ రామస్వామి తెలిపారు. రెండు నెలల్లో మళ్లీ వస్తానని, చెరువుల ఆక్రమణలపై పూర్తి నివేదికను సిద్ధం చేయాలని రంగనాథ్ ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో జరిగిన ఆక్రమణలపై పరిశీలించి తొలిగిస్తామని చెప్పారు. హైడ్రా కమిషనర్ ఆకస్మిక పర్యటనతో స్థానికంగా చర్చనీయాంశం కాగా బిల్డర్లల్లో గుబులు మొదలైంది.

అధికారి నోటి నుంచి ఒకటి! అధికారిక నోట్‌లో మరొకటి!

- కూల్చివేతలపై హైడ్రా పూటకోమాట
- నివాసగృహాల జోలికి వెళ్లబోమన్న కమిషనర్
- కూల్చివేతలు ఆగవంటూ అధికారిక నోట్ విడుదల

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 27(నమస్తే తెలంగాణ): 'అధికారికంగా ఉన్నా.. అనధికారికంగా ఉన్నా ఆ నివాసగృహాల జోలికి వెళ్లేది లేదు. ఎట్టిపరిస్థితుల్లోనూ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఉన్న ఇండ్లను కూలగొట్టం. చెరువుల ఆక్రమణల విషయంలో ప్రస్తుతం ఉన్న చెరువు స్థలాన్ని అభివృద్ధి చేస్తామే తప్ప ఇండ్ల జోలికే వెళ్లం. అసత్య ప్రచారాలు నమ్మవద్దు' అంటూ హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల హైడ్రా కార్యాలయంలో జరిగిన చెరువుల పునరుద్ధరణ మేధోమథన సదస్సులో వ్యాఖ్యానించారు. అదే రోజు సదస్సుకు సంబంధించి విడుదలైన అధికారిక ప్రెస్‌నోట్‌లో మాత్రం చెరువుల ఎఫ్‌టీఎల్ పట్టించుకోకుండా, సర్వే నెంబర్లను మార్చేసి నిర్మించిన కట్టడాలనే కూల్చేశామంటూ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అనుమతులు లేకుండా ఉన్న పెద్దవాళ్లైనా, పేదలవైనా ఇండ్లు కూల్చకతప్పదంటూ హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు.

అధికారి నోటి నుంచి ఒక మాట! అధికారికంగా విడుదల చేసిన ప్రెస్‌నోట్‌లో మరోమాట! హైడ్రా కమిషనర్ వ్యాఖ్యలపై , హైడ్రా కూల్చివేతలపై కొనసాగుతున్న చర్చ ఇది. అసలు హైడ్రా కార్యాచరణ ఎలా ఉండబోతోంది? కూల్చివేతలు కొనసాగిస్తారా!.. పేదల , పెద్దల ఇండ్లు కూల్చేయబోమంటూ బయటకు ప్రకటిస్తూ లోలోపల మాత్రం వేరే ప్లాన్‌తో ఉన్నారా?.. అసలు హైడ్రా ఏం చేయబోతున్నది? మళ్లీ బుల్డోజర్లతో తమపై విరుచుకుపడుతుందా?.. ప్రస్తుతం పలు చెరువుల వద్ద ఎన్నో ఏళ్లుగా ఉంటున్న ఇండ్ల యజమానులు, పలు కాలనీలకు సంబంధించిన స్థానికుల మధ్య జరుగుతున్న చర్చ. తమ దగ్గరికి వచ్చే లేదా తమకు తెలిసిన అధికారులను పదేపదే ఇవే ప్రశ్నలు అడుగుతున్నట్టు సమాచారం. ఈ నెల 22న హైడ్రా కార్యాలయంలో చెరువుల పునరుద్ధరణ, ఎఫ్‌టీఎల్ నిర్ధారణ, వరద నీటి కాలువల పరిరక్షణ అంశాలపై పలువురు రిటైర్డ్ ఇంజనీర్లు, నీటిపారుదలరంగ నిపుణులు, ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్, పొల్యూషన్ తదితర శాఖలకు సంబంధించిన మేధావులతో కమిషనర్ రంగనాథ్ మేధోమథన సదస్సు నిర్వహించారు. ఇందులో ఒక రిటైర్డ్ ఇంజనీర్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ చెరువులను పరిరక్షించే సమయంలో తప్పుడు అనుమతులతో ఉన్న ఇళ్లను మాత్రమే కూల్చేశామని, ఈ కూల్చివేతలతోనే ప్రజల్లో హైడ్రా అంటే అవగాహన వచ్చిందన్నారు. బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ అంటే ఏంటో హైడ్రా చర్యల వల్లే ప్రజలకు తెలిసిందని రంగనాథ్ అన్నారు. ఇప్పటివరకు ఎఫ్‌టీఎల్ పరిగణనలోకి తీసుకునే సర్వే చేయించామని, అనుమతులు రద్దు చేసినవి, అక్రమంగా అనుమతులు ఇచ్చిన కమర్షియల్ నిర్మాణాలనే కూల్చేస్తున్నామని చెప్పారు. అక్రమ నిర్మాణాల విషయంలో మానవత్వంతో ఆలోచిస్తే కూల్చలేమని, సమాజమంతా బాధపడాల్సి వస్తుందని, కొన్నిసార్లు మనసు చంపుకొని పనిచేయాల్సి వస్తుందని రంగనాథ్ అన్నారు. ఎఫ్‌టీఎల్‌లో ఉన్నా పర్మిషన్లు ఉంటే కూల్చేయబోమని, పర్మిషన్లు లేకున్నా అనధికారికంగా నివాసగృహాలు ఉంటే కూడా వాటి జోలికి వెళ్లబోమని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే ..

మధ్యతరగతి, పేదల జోలికే వెళ్లి వారి ఇళ్లను కూల్చేసిన హైడ్రా హైరైజ్ బిల్డింగులను ఎందుకు కూల్చేయలేదని ఓ రిటైర్డ్ ఇంజనీర్ ప్రశ్నించగా.. రంగనాథ్ సమాధానమిస్తూ తాము ఇప్పటివరకు అక్రమనిర్మాణాలను మాత్రమే కూల్చేశామని చెప్పుకొచ్చారు. హైరైజ్ బిల్డింగుల విషయంలో ప్రభుత్వ నిర్ణయం ప్రకారమే పోతున్నామని, ప్రధానంగా అక్కడ అనధికారికంగా అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు జరిగినా కోట్ల రూపాయల్లో నష్టపోయేది సామాన్య ప్రజలేనని అందుకే వాటిజోలికి వెళ్లలేదని బదులిచ్చారు. అయితే ఇదే మీటింగ్‌కు సంబంధించి విడుదల చేసిన అధికారిక నోట్‌లో మాత్రం చెరువుల ఎఫ్‌టీఎల్ పట్టించుకోకుండా, సర్వే నెంబర్లను మార్చేసి నిర్మించిన కట్టడాలనే కూల్చేశామని.. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో అనుమతులు లేకుండా ఉన్న పెద్దవాళ్లైనా, పేదలవైనా కూల్చకతప్పదంటూ హైడ్రా కమిషనర్ అన్నట్లుగా పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతాయా.. చెరువుల వద్ద నివాసగృహాల విషయంలో హైడ్రా ఏం చేయబోతోంది అన్న చర్చ ఓఆర్ఆర్‌లోపల పెద్దఎత్తున జరుగుతోంది.

సియోల్ కల సాకారమయ్యేదెలా?

- మూసీ ప్రక్షాళనకు సై.. సుందరీకరణకు నై
- నది వెంట ఆకాశహర్మ్యాలకు అవకాశం లేనట్టే
- 2012 బిల్డింగ్ రూల్స్ ప్రకారం బఫర్, ఎఫ్టీఎల్ జోన్లలో నిర్మాణాలకు వీల్లేదని స్పష్టం చేసిన హైకోర్టు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నవంబరు 27 (నమస్తే తెలంగాణ): 'దక్షిణ కొరియా రాజధాని సియోల్ నగరంలో చాంగ్ కై చున్ ఉప నది ప్రవహిస్తున్నట్టుగా మన హైదరాబాద్ నగరం మధ్య నుంచి మూసీ నది ప్రవహిస్తున్నది. అందుకే సీఎం రేవంత్‌రెడ్డి మమ్మల్ని సియోల్ టూర్‌కు పంపారు. చాంగ్ కై చున్ చుట్టుపక్కల ఎన్నో ఆకాశహర్మ్యాలు, వాటిలో పలు రెస్టారెంట్లు వచ్చినయి. అవన్నీ పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో వచ్చిన ప్రాజెక్టులు. హైదరాబాద్‌లో మూసీ పరిసర ప్రాంతాలను కూడా అలా తయారు చేస్తే ప్రపంచంలోనే గుర్తింపు వస్తుంది.'

దక్షిణ కొరియాలో పర్యటన సందర్భంగా భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మరికొందరు రాష్ట్ర మంత్రులు సియోల్‌లో చాంగ్ కై చున్ ఉప నది పక్కన నిలబడి మూసీ సుందరీకరణపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వ ప్రణాళికను వెల్లడించిన తీరిది.

'నీటి వనరుల పరిరక్షణ నిమిత్తం 2012లో ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం బిల్డింగ్ నిబంధనలను రూపొందిస్తూ జీవో 168 జారీ చేసింది. ఆ నిబంధనల ప్రకారం ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. మూసీ నదీగర్భం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న అనధికారిక నివాసాలను ఖాళీ చేయించేందుకు చర్యలు చేపట్టండి. ఆ నిర్మాణాలను తొలగించేందుకు సుప్రీంకోర్టు గతంలో పలు సందర్భాల్లో జారీచేసిన మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయాలి.'

మూసీ సుందరీకరణపై రెండు రోజుల కిందట హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు ఇవి.

మరి.. సామాన్యుడైనా, సర్కారైనా చట్టం అందరికీ సమానమే. మూసీ నదీగర్భం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిరుపేదలకైనా, మూసీ సుందరీకరణలో భాగంగా ఆ నది పొడవునా కార్పొరేట్ సంస్థలతో ఆకాశహర్మ్యాలు నిర్మించేందుకు స్కెచ్ వేసిన రాష్ట్ర ప్రభుత్వానికైనా హైకోర్టు ఆదేశాలు ఒకేలా వర్తిస్తాయని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. దీంతో సియోల్‌లోని చాంగ్ కై చున్ ఉప నది పక్కన నిర్మించినట్టుగా మూసీ నదికి ఇరువైపులా 50 మీటర్ల పరిధిలో వ్యాపార ప్రాజెక్టుల నిర్మాణానికి అవకాశం లేనట్టేనని, రేవంత్‌రెడ్డి సర్కారు సియోల్ కల చెదిరిపోయినట్టేనని అర్థమవుతున్నది.

మూసీ ప్రక్షాళనతో మురుగు నుంచి జీవనదికి మోక్షం లభిస్తుందనేది వాస్తవమే. కానీ, రేవంత్‌రెడ్డి మాత్రం మూసీ ప్రక్షాళనను పక్కనపెట్టి, సుందరీకరణలో భాగంగా కార్పొరేట్ కంపెనీలతో పీపీపీ పద్ధతిలో ప్రాజెక్టులను చేపట్టాలని నిర్ణయించినట్టు గత 11 నెలల కాలంలో చోటుచేసుకున్న పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. అసలు మూసీలోకి మురుగు వెళ్లకుండా నిరోధించేందుకు గతంలో కేసీఆర్ ప్రభుత్వంలో చేపట్టిన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ల నిర్మాణాన్ని పూర్తి చేయకుండా, మూసీలోకి గోదావరిజలాల తరలించే ప్రాజెక్టును మొదలుపెట్టకుండానే రేవంత్‌రెడ్డి సర్కారు ఆ నది వెంట ఉన్న నిరుపేదల నిర్మాణాల కూల్చివేతలను ప్రారంభించింది. ఈ కూల్చివేతలపై కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో రెండ్రోజుల క్రితం హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. మూసీ పరిరక్షణ కోసం నదీగర్భం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు లేకుండా చర్యలు చేపట్టాలని స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. దీంతో రేవంత్‌రెడ్డి సర్కారు అనుకున్నట్టుగా సియోల్ తరహాలో మూసీ వెంబడి హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వినోద, వ్యాపార కేంద్రాలతో కూడిన బహుళ అంతస్తుల నిర్మాణ ప్రాజెక్టులు చేపట్టేందుకు నిబంధనలు అనుమతించవని స్పష్టమవుతున్నది. భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి 1998-2011 మధ్య కాలంలో వచ్చిన జీవోలను మేళవించి 2012లో ఉమ్మడి ఏపీ ప్రభుత్వం జారీచేసిన జీవో 168లోని నిబంధనల గురించి హైకోర్టు తన ఆదేశాల్లో ప్రత్యేకంగా ప్రస్తావించింది.

జీవో 168లో ప్రధానాంశాలు

- 10 మీటర్ల కంటే తక్కువ వెడల్పు ఉన్న కాల్వలు, వాగులు, నాలాలకు ఇరువైపులా 2 మీటర్ల వరకు నిర్మాణాలు చేపట్టేందుకు వీల్లేదు.
- 10 మీటర్ల కంటే ఎక్కువ వెడల్పు ఉన్న కాల్వలు, వాగులు, నాలాలకు ఇరువైపులా 9 మీటర్ల వరకు నిర్మాణ అనుమతులపై ఆంక్షలు.
- 10 హెక్టార్ల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువులు, ట్యాంకులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ నుంచి 9 మీటర్ల వరకు నిర్మాణాలను అనుమతించకూడదు.
- 10 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న చెరువులు, ట్యాంకులు, కుంటలకు ఎఫ్‌టీఎల్ నుంచి 30 మీటర్ల వరకు నిర్మాణాలు చేపట్టే వీల్లేదు.
- గ్రామ పంచాయతీల పరిధిలో ఉండే నదులకు సంబంధిత శాఖలు నిర్ధారించిన హద్దుల నుంచి 100 మీటర్ల వర